క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



మాచర్ల: నియోజకవర్గ బీజేపీ నాయకులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి నియోజకవర్గంలోని కమ్యూనిటీ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ జి.నాసరయ్య, జీఎస్సీ మోర్చ నియోజకవర్గ నాయకులు విజయ్‌కుమార్, కంభంపాటి అమర్, శ్రీనివాసరావు తదితరులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తప్పనిసరిగా నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారని బీజేపీ నాయకులు చెప్పారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



మాచవరం: ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన ఘటన మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జోగిపర్తి ఆంజినేయులు తన భార్య కాన్పు నిమిత్తం శనివారం నరసరావుపేట ఆసుపత్రికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటాన్ని ఇరుగుపొరుగు వారు గమనించి విషయాన్ని ఇంటి యజమానికి తెలియజేశారు. ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలోని 50 సవర్ల బంగారం, రూ.2.50 లక్షలు నగదు, కిలో వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులకు తెలియజేయగా గురజాల సీఐ బాలకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించి, వివరాలను నమోదు చేశారు.

విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి అమోఘం



మాచర్ల రూరల్: ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తారని మాచర్ల నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు, వాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ వెంకట రమణ అన్నారు. ఆదివారం మాచర్ల పట్టణ శివారులోని గౌతమ్ స్కూల్ ఆవరణలో రిటైర్డ్ ఎంఈవో వేముల నాగయ్య సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో ఎంతో దీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తారన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు వేముల నాగయ్యను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గౌరవాధ్యక్షులు బి.వెంకటరెడ్డి, సెక్రటరీ ఎస్.శ్రీనివాసులు, వైస్‌ప్రెసిడెంట్ ఫాతిమా మర్రెడ్డి, సాయితేజ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరాజు, ట్రెజరర్ శ్రీగౌతమ్ ఖాసి, కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం శాస్త్రి, మాచర్ల, దుర్గి, రెంటచింతల ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు.

డయేరియా లక్షణాలతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి

పిడుగురాళ్ల: పట్టణంలోని డయేరియా లక్షణాలతో మున్సిపల్ కార్మికుడు పరస బాలకృష్ణ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారు మాట్లాడుతూ.. పిడుగురాళ్ల పట్టణంలోని డయేరియా వివిధ కాలనీలలో విజృంభిస్తోందని, దీనిని నివారించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బాలకృష్ణ డయేరియా రోగి వద్ద డబుల్ డ్యూటీ చేయటం వలన డయేరియా సోకి స్థానిక హాస్పటల్‌లో చికిత్స పొంది, మెరుగైన వైద్య కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా శనివారం మృతి చెందారని అన్నారు. కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మట్టి ఖర్చులు వెంటనే చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్ఫూర్తిదాయకం మహానేత పాలన




అద్దంకి నార్కెట్‌పల్లి హైవే



మోర్జంపాడులో వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం

- రుణమాఫీ, ఉచిత విద్యుత్‌తో రైతుల్లో ఆనందం
- ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వినూత్న పథకాలు
- వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో అద్దంకి నార్కెట్‌పల్లి హైవే నిర్మాణం
- మోర్జంపాడు ఎత్తిపోతల పథకం
- నేడు మహానేత వైఎస్సార్ జయంతి

కారెంపూడి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి నేడు. ఈ సందర్భంగా ఆ మహానేతను ప్రజలు స్మరించుకుంటున్నారు. రైతు రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు, మహిళా గ్రూపులకు పావలా వడ్డీకే రుణాలు, అర్హులందరికీ పింఛన్లు, తెల్ల రేషన్ కార్డులు, జలయజ్ఞంలో భాగంగా పులిచింతల ప్రాజెక్టు, నాగార్జున సాగర్ ఆధునీకరణ, ఇందిరమ్మ గృహ నిర్మాణాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో సమానంగా బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి హామీ ద్వారా వంద రోజుల పని దినాలు కల్పించడం... ఇలా మహానేత పాలనలో తీసుకున్న చర్యలు అపూర్వం. రుణమాఫీతో అప్పుల ఊబిలో కూరుకున్న ఎందరో అన్నదాతల ప్రాణాలు నిలిచాయి. ఉదాహరణకు కారెంపూడి మండలంలో 2009 నాటికి 13,315 కుటుంబాలలో 3,616 మందికి వివిధ రకాల పింఛన్లు అందించిన ఘనత. 4,838 గృహాలు నిర్మించడం జరిగింది. పావలా వడ్డీ ద్వారా 546 గ్రూపులు లబ్ధి పొందాయి. ఉపాధి హామీ కింద 2,656 మంది సగటున రూ.57,386 సంపాదించారు. అలాగే ఆరోగ్యశ్రీ ద్వారా 28 మంది నిరుపేదల ప్రాణాలు నిలబడ్డాయి. ఉపకార వేతనాల ద్వారా 1,656 మంది, ఫీజు రియింబర్స్‌మెంట్ ద్వారా 1,623 మంది లబ్ధి పొందారు. 1064 మంది రైతులు ఉచిత విద్యుత్ ద్వారా లబ్ధి పొందారు. రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుదీకరణ యోజన కింద 1,888 గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. 379 మంది పేదలకు సాగు భూములివ్వడం అప్పట్లో ఓ చరిత్రే. ఉమ్మడి జిల్లాలో 56,711 మందికి ఇండ్ల స్థలాలు మంజూరు చేశారు. రైతు రుణమాఫీ వల్ల మండలంలో 10,904 మంది రైతులు లబ్ధి పొందారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గడపలో వైఎస్సార్ హయాంలో మేలు జరగడంతో ఆర్థిక పురోగతిని సాధించారు. వైఎస్సార్ హయాంలో అప్పట్లోనే సగటున ఎకరా రూ.30 లక్షల ధర పలికింది. నిజమైన అభివృద్ధి వైఎస్సార్ హయాంలోనే జరిగిందనేది జగమెరిగిన సత్యం. ఆ పాలన స్ఫూర్తి దాయకం.



అభివృద్ధి ప్రదాత వైఎస్సార్

పిడుగురాళ్ల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు భారీ స్థాయిలో జరిగాయి, ఒక్కొక్క రైతుకు, పట్టణ ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించిన మహానేత దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ప్రధానంగా ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అద్దంకి నార్కెట్‌పల్లి హైవేను నిర్మించి ప్రజల ఇబ్బందులకు స్వస్తి పలికారు. నార్కెట్‌పల్లి నుంచి అద్దంకి వరకు సుమారు 218 కి.మీ. నాలుగు వరసల హైవేను నిర్మించారు.

మోర్జంపాడు ఎత్తిపోతల నిర్మాణం...

మాచవరం మండలం మోర్జంపాడు గ్రామ రైతుల సాగు నీరు కోసం కాలువ సౌకర్యం లేకపోవటంతో గోవిందాపురం కృష్ణా నది సమీపంలో ఎత్తిపోతల పథకాన్ని రూ.50 కోట్లతో 3 వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా చేపట్టారు.

వైఎస్సార్ హయాంలో మున్సిపాలిటీగా పిడుగురాళ్ల...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నగర పంచాయతీగా ఉన్న పిడుగురాళ్లను మున్సిపాలిటీగా మార్చారు. దీంతో పట్టణంలో వార్డుల సంఖ్య పెరిగి అభివృద్ధి చెందింది.

పిడుగురాళ్లకు కృష్ణా జలాలు...

పిడుగురాళ్ల పట్టణాన్ని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2006లో సుమారు రూ.28 కోట్లు మంజూరు చేసి గోవిందాపురం నుంచి అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా పిడుగురాళ్ల పట్టణానికి కృష్ణా జలాలు అందించేందుకు తాగునీటి ప్రాజెక్టును చేపట్టారు. అయితే టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయటంతో తిరిగి 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఈ ప్రాజెక్టును పూర్తి చేయించి పిడుగురాళ్ల ప్రజలకు తాగునీరు అందించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు



విజయపురిసౌత్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్క్, టీడీపీ నాయకులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డిపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ఎమ్మార్పీఎస్ పార్టీ జెండాను పీపీ కుక్కమూడి సురేష్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం వీహెచ్‌పీఎస్ నాయకులు డేగల ఎలీషా మాదిగ, శ్రీనివాసరావు చౌదరి కలిసి కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గడ్డిపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్‌లో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ పార్టీ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టాలంటూ మహా ఉద్యమాలను చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల అధ్యక్షులు జొన్నలగడ్డ ఎర్ర వెంకయ్య మాదిగ, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి మరియబాబు మాదిగ, వీహెచ్‌పీఎస్ నాయకులు ఎలీషా మాదిగ, ఓరుగంటి థామస్‌రెడ్డి, సిల్వరాజు మాదిగ, మునలయ్య మాదిగ పాల్గొన్నారు.

ఘనంగా మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

విజయపురిసౌత్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్ ఆధ్వర్యంలో ఆదివారం విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం టీడీపీ నేత బసివిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, వికలాంగుల పింఛన్ కోసం మంద కృష్ణ మాదిగ చేసిన కృషి గర్వనీయం అన్నారు. ప్రజా సమస్యలపై ఎమ్మార్పీఎస్ అలుపెరుగని పోరాటం చేసారని కొనియాడారు. ఏపీలో ఎన్డీయే గెలుపుకోసం ఎమ్మార్పీఎస్ మద్దతుగా నిలవడం అభినందనీయం అన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ నాయకుడు పలుకూరి జోసెఫ్ బాబు ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, ఆదెపు కోటయ్య, సత్తిబాబు, జనసేన అధ్యక్షుడు రాహుల్, కోట అనూక్, అందుగుల యాకోబు, గంటా ధనుంజయ రావు, కట్టారాజు, నరసింహులు, చరణ్, పండు అప్పలరాజు, అశోక్, మహేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆరాధన దినోత్సవం



ఆంధ్రా ఇవాంజలికల్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ ఐజయ్య



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ కిరణ్‌కుమార్

మాచర్ల: పట్టణంలోని ఆయా చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ఆరాధన దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. మాచర్ల పట్టణంలోని రోప్‌వే కాలనీ ప్రాంతంలో పాస్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ కిరణ్ తన సందేశాన్ని అందిస్తూ ఏసు క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరు పాటించాలని, దైవ నిర్ణయం ప్రకారం నడచుకోవాలని కోరారు. అదే విధంగా అంబేడ్కర్ సెంటర్ సమీపంలో ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చిలో పాస్టర్ ఐజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌సీఎం, ఇవాంజలికల్ లూథరన్ చర్చితో పాటు, బేతేలు మందిరం, పెంతెకోస్తు చర్చిల్లో ఆయా పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేడు వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయండి

మాచర్ల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి కార్యక్రమం మాచర్ల నియోజకవర్గంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు చేపట్టి, పేద ప్రజల పక్షపాతిగా, ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలలోని వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా మాచర్ల పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద 10 గంటలకు జరిగే వేడుకలకు వైఎస్సార్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొని జయప్రదం చేసే విధంగా చూడాలని మేరాజోత్ హనుమంత్ నాయక్ కోరారు.

గురజాలలో...

గురజాల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పిడుగురాళ్లరూరల్ మండలంలో...

పిడుగురాళ్లరూరల్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహాల వద్ద జయంతి వేడుకలను జరపాలని, ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని సూచించారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు చేపట్టాలని, సేవ కార్యక్రమాలు కూడా నిర్వహించాలని వారు కోరారు. నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

రెంటచింతలలో...

రెంటచింతల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్



రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని పుర స్కరించుకుని స్థానిక మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారి వెంబడి నున్న వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద తలపెట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, రెంటచింతల–3 ఎంపీటీసీ గాలి ప్రతాప్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఇచ్చిన పిలుపుమేరకు ఉదయం 10 గంటలకు జరగనున్న వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో మండలంలోని గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాచర్ల మండలంలో...

మాచర్ల రూరల్: మాచర్ల మండలంలోని అన్ని గ్రామాలలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పలువురు నాయకులు ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానులు వైఎస్సార్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పలు చోట్ల కేక్ కటింగ్, పులిహోర పంపిణీ వంటి కార్యక్రమాలున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా అద్దంకమ్మ జాతర

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ దేవత అద్దంకమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు పొంగళ్లు, నైవేద్యాలు పెట్టారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో అమ్మవారితోపాటు ఉపదేవతలకు కూడా గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం జాతరలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

పిడుగురాళ్లలో పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం తెలియజేసింది. ఉదయం 10 గంటలకు 5వ వార్డులోని కొండమోడు జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద, 10.20 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్ద, 10.30 గంటలకు అంజిరెడ్డి హాస్పిటల్ వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో పాల్గొంటారు. 11 గంటలకు పార్టీ కార్యాలయంలో పాల్గొంటారు.

కాచి చల్లార్చిన నీటిని తాగండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్



మాచర్ల: పట్టణ పురపాలక సంఘంలో వర్షాకాలం సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని కాచి చల్లార్చి వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని వార్డులలో సమస్యలుంటే సచివాలయాలలో సిబ్బంది దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అందులో భాగంగా నెహ్రూ నగర్‌లో వార్డుల సెక్రటరీల వివరాలు పేర్కొన్నారు. ఆయా వార్డుల ప్రజలు సమస్యల పరిష్కారానికి శ్యామల స్టీఫెన్, ఘంటా తేజస్వి, సత్యాల స్టీఫెన్, అడపా ఆదిత్య సాయి, నందిగం సునిల్, పోలు రామిరెడ్డి, ప్రత్తిపాటి కుమారి, కుమ్మరపల్లి ఛాయాకృష్ణ, కె.షకీనా, గున్నా రమ్య, కేశిరెడ్డి లావణ్య, బొలకా రాము, మాతంగి దేవేందర్, పొన్నెల్లి ఈశ్వరరాజు, రమావత్ సంజీ నాయక్, గంజి ఆంజనేయులును సంప్రదించాలని కమిషనర్ వెంకట్‌దాస్ తెలిపారు.